## క్లుప్తంగా

### ఉత్సవ కమిటీ ఎన్నిక


ఉత్సవ కమిటీ నూతన సభ్యులు

మొయినాబాద్: మహనీయుల ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా సురంగల్‌కు చెందిన బీ రాజు ఎన్నికయ్యారు. శుక్రవారం మొయినాబాద్‌లో మహనీయుల ఉత్సవాల కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్ రాజు, వైస్ చైర్మన్లు కే రాంచందర్, సీ కిరణ్, ప్రధాన కార్యదర్శిగా ఎం రాజు, కోశాధికారిగా పీ యాదగిరి, సహాయ కార్యదర్శిగా డీ ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా సీ మల్లేష్, కార్యదర్శిగా సీ శ్రీనివాస్, సలహాదారులుగా రాజేష్‌గౌడ్, వినోద్‌కుమార్, షేక్ వాజిత్, ఏ యాదయ్య, పీ రాజు, కార్యవర్గ సభ్యులుగా బీ శివ, కే నర్సింలు, ప్రమోద్, నవీన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ రాజు మాట్లాడుతూ.. ఏప్రిల్ మాసంలో మహనీయుల జయంతి ఉత్సవాలు ఉన్నాయని, అందుకే కమిటీ వేసినట్లు తెలిపారు.

### అయ్యప్ప సన్నిధాన నిర్మాణానికి విరాళం

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని, అయ్యప్ప సన్నిధాన నిర్మాణానికి తన వంతుగా రూ. 60వేలు విరాళం అందజేసిన్నట్లు పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎన్ రాంరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మాచన్‌పల్లిలో అయ్యప్ప సన్నిధాన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ దైవభక్తి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టీ సత్తయ్య, నాయకులు మోహన్‌రెడ్డి, కుమార్, గిరీష్, రాజాశేఖర్, నరేందర్, చంద్రశేఖర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

### దుకాణ సముదాయ నిర్మాణానికి రూ.62లక్షలు

మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదట దుకాణా సముదాయ నిర్మాణానికి రూ.62 లక్షలు మంజూరైనట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. పట్టణంలో వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌యార్డు ఆదాయం పెంపునకు, రైతులకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నుంచి 8 దుకాణాల నిర్మాణానికి రూ.62 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. కడ్తాల మండల కేంద్రంలో హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన చెక్ పోస్టు భవన నిర్మాణానికి రూ.7.5లక్షలు మంజూరయ్యాయని వివరించారు. తలకొండపల్లి క్రాస్‌రోడ్ వద్ద గల వ్యవసాయ మార్కెట్ గోదాం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

### నాగేశ్వరరావుకు ఘన సన్మానం

కడ్తాల్: నిరుద్యోగ యువత కోసం ఇంపాక్ట్ సంస్థను ఏర్పాటు చేసి, వారికి ఉచిత శిక్షణ ఇస్తున్న సంస్థ నిర్వాహకులు నాగేశ్వరరావును శుక్రవారం సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంపాక్ట్ సంస్థ ఏర్పాటు చేసిన నాగేశ్వరరావు తన ప్రసంగాల ద్వారా యువతీయువకుల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. ఆయన ప్రసంగాలు యువత భవితకు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు.

### 'ఐక్యత' నిధులతో తండాల అభివృద్ధి

ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి


విజయ కేతనం చూపుతున్న రాఘవేందర్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: ఐక్యత ఫౌండేషన్ నిధులతో గిరిజన తండాలను అభివృద్ధి చేస్తామని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని పాత కోట తండాలో పర్యటించారు. వారి వృత్తి ఆదాయ వనరులను గమనించారు. తండావాసుల కోరిక మేరకు హనుమాన్ ఆలయం గ్రిల్స్, బండలు, పెయింటింగ్ వేయిస్తానని హామీ ఇచ్చారు. తండాల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఫౌండేషన్ సహకారంతో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్(పీకేటీ) పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అలివేలు, ఉప సర్పంచ్ గురుసింగ్, వార్డు సభ్యులు దేశ్యానాయక్, వాచ్యానాయక్, శ్రీను, జీర్యానాయక్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆ ఇంట.. సిరుల'పంట'

- సాగులో రాణిస్తున్న యువ జంట
- రెండెకరాల్లో పూల మొక్కల పెంపకం
- తోటి రైతులకు నాణ్యమైన నారు
- తెలంగాణ, ఏపీలోని జిల్లాలకు సరఫరా
- మరో 25మందికి ఉపాధి కల్పిస్తూ..

**ఉన్నత చదువులు చదివారు.. ప్రభుత్వ కొలువు కోసం ఎదురుచూడలేదు. తమకు ఇష్టమైన వ్యవసాయాన్నే ఉపాధిగా మలచుకున్నారు. అందులో ఆర్థిక ప్రగతి సాధిస్తూ మరి కొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. అంతేకాకుండా తోటి రైతులకు నాణ్యమైన నారు సరఫరా చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు యువ జంట.**


నర్సరీలో పెంచుతున్న పూల మొక్కల నారు

షాబాద్: మండలంలోని సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన రాజు, స్వప్న(దంపతులు) సాగులో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఉన్నత చదువులు చదివిన వీరు ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా పూల పంటలు సాగు చేస్తూ, పలువురికి ఉపాధి కల్పిస్తూ ఔరా అని పించుకుంటున్నారు. ఈ యువ దంపతులకు రెండు ఎకరాల పొలం ఉంది. అందులో వివిధ రకాల పూల పంటలు వేశారు. పూల నారు పోసి తోటి రైతులకు సరఫరా చేస్తున్నారు. అంతేకాకుండా మార్కెట్ ధర కంటే తక్కువకు పూలను విక్రయిస్తున్నారు. ఆరు సంవత్సరాలుగా వ్యవసాయంలో రాణిస్తూ మరో 25 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. రూ. 15లక్షలతో పూల మొక్కల నర్సరీ ఏర్పాటు చేశారు. అందులో గులాబీ, చామంతి, బంతి నారు పెంచుతున్నారు. మార్కెట్‌లో గులాబీ నారు మొక్క రూ. 20 ఉండగా వీరు రూ.12 నుంచి రూ.15లోపు వరకు మాత్రమే విక్రయిస్తున్నారు. చామంతి నారు సైతం రూ. 1.50 పైసల నుంచి రూ. 2 వరకే అందిస్తున్నారు.

**నాణ్యమైన నారు సరఫరా**

ఒక రైతుగా.. తోటి రైతుల బాధలు తెలిసిన రాజు, స్వప్న నాణ్యమైన పూల నారును పెంచి విక్రయిస్తున్నారు. దీంతో యువ దంపతులు పెంచే నారుకు మంచి డిమాండ్ ఉంది. ఫోన్లు చేసి ఆర్డర్ ఇస్తుంటారు. దాదాపు తెలంగాణలోని అన్ని జిల్లాల రైతులు ఇక్కడికి వచ్చి నారు తీసుకుపోతారు. ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, కడప జిల్లాలకు చెందిన రైతులకు కూడా నారు సరఫరా అవుతోంది. వ్యవసాయంలో ఉన్న


చామంతి పూలు కోస్తున్న రాజు, స్వప్న

లాభాలు వేరే ఎక్కడా లేవని వారు చెబుతున్నారు. తమిళనాడు, కృష్ణగిరి నుంచి గులాబీ నారు విత్తనాలు సెంట్ బుల్లెట్, కస్టార్, ఎల్లో ఆరెంజ్ రకాలు తెచ్చి నర్సరీలో పెంచుతున్నట్లు తెలిపారు.

**25 మందికి ఉపాధి**

నర్సరీ ద్వారా రోజుకు 25 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ట్రేలలో ఎరువులు నింపడం, విత్తనాలు వేయడం, నారు మొక్కలు పెట్టడం, రైతులకు నారు తీసి అందించడం వంటి పనులు చేస్తుంటారు. రోజుకు ఒక్కక్కరికి రూ. 300 వరకు కూలి ఇస్తున్నారు.

**సాగుపై మక్కువతోనే..**



వ్యవసాయంపై మక్కువతోనే నేను ఒక రైతు బిడ్డగా నా సొంత పొలంలో నర్సరీ ఏర్పాటు చేసి గులాబీ, చామంతి నారు మొక్కలు పెంచుతున్నా. బహిరంగ మార్కెట్‌లో ఒక్క గులాబీ మొక్కను రూ. 20కి పైగానే విక్రయిస్తున్నారు. మా వద్ద రూ. 12 నుంచి రూ. 15లోపే ఉంటుంది. వివిధ జిల్లాల రైతులకు నారు సరఫరా చేస్తున్నాం. నెలకు అన్ని ఖర్చులు పోను దాదాపు రూ. లక్ష వరకు ఆదాయం వస్తోంది.

– రాజు, రైతు

**మంచి ఆదాయం**



మేము ఉన్నత చదువులు చదివినా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడలేదు. ఒకరి చేతి కింద పనిచేయడం ఇష్టం లేదు. అందుకే వ్యవసాయ రంగాన్ని ఎంచుకున్నాం. సొంత గ్రామం, సొంత పొలంలో పూల మొక్కల నర్సరీ ఏర్పాటు చేశాం. నారు విక్రయించడం ద్వారా మంచి ఆదాయం వస్తోంది. నర్సరీలో పని చేయడం సంతోషంగా ఉంది.

– స్వప్న, నర్సరీ నిర్వాహకురాలు

### ప్రధాని సభను సక్సెస్ చేద్దాం

షాద్‌నగర్ రూరల్: నగరంలో శనివారం జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభను జయప్రదం చేద్దామని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఏ వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు.

**విజయవంతం చేద్దాం**

చేవెళ్ల: ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఏ అనంత్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు మనమంతా సిద్ధంగా ఉన్నామని సభకు వెళ్లి సత్తా చాటుదామన్నారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

### నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ మున్సిపల్ నేతల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని శనివారం ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సాయి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ఎల్‌ఎన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఉంటుందని, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

# దీన్ని సంత అంటారా..?


సంతలో వ్యాపారులు వదిలేసి వెళ్లిన కూరగాయల వ్యర్థాలు

- వ్యర్థాలతో కంపుకొడుతున్న షైబజార్
- ఇబ్బంది పడుతున్న సమీప కాలనీ వాసులు
- చర్యలు తీసుకుంటాం: సర్పంచ్ శైలజ

చేవెళ్ల: మండల కేంద్రంలో వారంతపు సంత నిర్వహించే ప్రాంతం అపరిశుభ్రతకు అడ్డాగా మారింది. కూరగాయలు విక్రయించే వారు మిగిలిన వాటిని అలాగే వదిలేసి వెళ్లడం, సంత నిర్వాహకులు వాటిని తొలగించక పోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. చేవెళ్లలో ప్రతి గురువారం అంగడి బజార్‌ను నిర్వహిస్తారు. ఇక్కడ కూరగాయలతో పాటు నిత్యవసర వస్తువులు విక్రయిస్తారు. అయితే సాయంత్రం వరకు దుకాణాలు నిర్వహించే వారు మిగిలిన కూరగాయలను అక్కడే వదిలేసి వెళుతున్నారు. మళ్లీ సంత జరిగే రోజు వరకు వ్యర్థాలను తొలగించడం లేదు. దీంతో అవి కుల్లి దుర్వాసన వెదజల్లుతున్నాయి. సంత ప్రాంతంలో పశువులు, పందులు తిరుగుతుండడంతో సమీప కాలనీ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కూరగాయల వ్యర్థాల కారణంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని కాలనీ ప్రజలు తెలిపారు. పలు మార్లు ఈ సమస్యను పంచాయతీ సిబ్బందికి, షైబజారు నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

**చర్యలు తీసుకుంటాం**

సంత పరిసరాల పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. పాలకవర్గంలో చర్చించి సంత నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేస్తాం. సంతలో దుకాణాలు నిర్వహించే వారు కూడా ఎక్కడ పడితే అక్కడ కూరగాయలు వదిలేసి వెళ్లకుండా చూస్తాం. అలాగే సంత జరిగే ప్రాంతంలో చెత్త డబ్బాలు ఏర్పాటు చేస్తాం.

– శైలజ, సర్పంచ్

### నేడు 'రన్ ఫర్ జీసస్'

షాద్‌నగర్ టౌన్: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్షుడు జోసెఫ్ అంజన్న శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 5గంటలకు పట్టణంలోని ఢిల్లీ వరల్డ్ స్కూల్ నుంచి ప్రారంభమై క్రిష్టియన్ కాలనీలోని జీయోన్ ఎంబీ చర్చి వరకు సాగుతుందని పేర్కొన్నారు. అన్ని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రిస్టియన్లు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

### ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

ఆమనగల్లు: ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించే ఎస్‌ఐ, 21న నిర్వహించే తుది రాత పరీక్షలకు హాజరు అవుతున్న అభ్యర్థులు ఆత్మ విశ్వాసం కోల్పోవద్దని ఆమనగల్లు సీఐ ఉపేందర్ సూచించారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో శుక్రవారం సీఐ ఉపేందర్ విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాది కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రెండు నెలల పాటు పోలీసు ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణిచ్చామన్నారు. అప్పట్లో శిక్షణ పొందిన వారిలో దాదాపు 70మంది ప్రాథమిక పరీక్ష, దేహదారుఢ్య పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి తుది రాత పరీక్షకు ఎంపికయ్యారని ఆయన చెప్పారు.

### కాంగ్రెస్‌తోనే మార్పు సాధ్యం


నూతన కమిటీ సభ్యులతో మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే మార్పు సాధ్యమని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లోయపల్లి గ్రామానికి చెందిన మిద్దె నవీన్ గౌడ్‌కు యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. నియంతృత్వ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు ఎద్మా నరేందర్ రెడ్డి,పీఏసీయస్ డైరెక్టర్లు హన్మంత్‌రెడ్డి, వేణుగోపాల్ రావు,నాయకులు విక్రమ్ గౌడ్, పోచయ్య, ఏర్పుల రాజు,"సురేష్ పాల్గొన్నారు.

# అనుమతి లేని పాఠశాలపై ఫిర్యాదు


ఎస్‌ఐ ప్రణయ్‌తేజ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మొయినాబాద్: ప్రభుత్వ అనుమతి లేకుండా నడుపుతున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు ఎస్ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు మొయినాబాద్ ఎస్సై ప్రణయ్‌తేజ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొయినాబాద్‌లో ఎలాంటి అనుమతులు లేకున్నా శ్రీ చైతన్య పేరిట పాఠశాల నడుపుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో ప్రచారం చేసి విద్యార్థులను చేర్పుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. దీనిపై విద్యాశాఖ, పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మణికంఠ, అజయ్, వికాస్, సాయి, చైతన్య, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# కుట్రలను తిప్పికొడుదాం

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బలహీన పరిచేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టి వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధిద్దామని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మాడ్గుల మండల కేంద్రంలో వాసవి ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వినూత్న పథకాలు అమలు చేస్తున్నారని.. రాష్ట్రంలో ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అంతున్నాయని ఆయన వివరించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు బీజేపీ యత్నిస్తోందని.. కుట్రలో భాగంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎస్‌ఎస్‌సీ పేపర్ లీకేజీకి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. విపక్షాల కుట్రలను తిప్పికొట్టి బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పగడాల రవి, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు అంబాల జంగయ్యగౌడ్, యాదిరెడ్డి, రమేశ్‌రెడ్డి, వసురాంనాయక్, పార్వతమ్మ, రూప, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, సుభాశ్, ధర్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, లాలయ్యగౌడ్, డాక్టర్ రాంరెడ్డి, రాములు, భూపతిరెడ్డి, విష్ణు, వరుణ్, అనిల్, చలమందగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ పేదలకు మేలు


కడ్తాల్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి

కడ్తాల్: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన శుక్రవారం తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య తెలంగాణ సాధనకు ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జైపాల్‌నాయక్ పాల్గొన్నారు.

**చెక్కు అందజేత**

తలకొండపల్లి: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంలా మారిందని మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాతకోటతండాకు చెందిన పాత్లావత్ మల్లేశ్‌కు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.20వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ చెక్కును శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధిత కుంటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అలివేలు, జీర్యానాయక్, గోపి, పాండు, తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడేవారికే పార్టీలో భవిష్యత్

- బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్

యాచారం: కష్టపడి పనిచేసే వారికి పార్టీలో భవిష్యత్ ఉంటుందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ నుంచి వేధింపులు, ఇబ్బందులు ఉంటాయని వాటిని తట్టుకుంటూ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడిగా గణేశ్‌నాయక్‌ను నియమిస్తూ ఆయనకు నియామకప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, నాయకులు గోగికార్ రమేశ్, విజయకుమార్, నక్క శ్రీనివాస్ యాదవ్, పల్లపు నరేశ్, పత్తి రాజు, సంగెం శ్రీనాథ్, గంగల శేఖర్, గొరిగే హరికృష్ణ, నేనావత్ జగదీశ్, మస్కురి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.


షాబాద్: దైవ సందేశం వినిపిస్తున్న పాస్టర్


కొత్తూరు: ఫాతిమాపూర్‌లో గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను తెలియజేస్తున్న పాస్టర్


కేశంపేట: శిలువను మోస్తున్న పాస్టర్

### ప్రత్యేక ప్రార్థనలు

గుడ్ ఫ్రైడే సందర్భంగా నియోజకవర్గంలోని చర్చిల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందు రోజు చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. పాస్టర్లు గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించి దైవ సందేశం వినిపించారు. అనంతరం భక్తి గీతాలు ఆలపించారు. వేడుకలో క్రిస్టియన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


షాబాద్: మరియాపురం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


షాబాద్: ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు


కొందుర్గు: లూర్దునగర్‌లో..